క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


అనిల్‌కుమార్ పాణిగ్రాహి (ఫైల్)

కంచిలి/సోంపేట: మండలంలోని జలంత్రకోట గ్రామ కూడలి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బారువకు చెందిన అనిల్‌కుమార్ పాణిగ్రాహి (28) గురువారం ఉదయం మృత్యువాత పడ్డాడు. ఆ రోజు జరిగిన ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరిలో డ్రైవింగ్ చేస్తున్న హరీష్‌కుమార్ పాణిగ్రాహి ఘటనా స్థలంలోనే మృతి చెందిన సంగతి తెలిసిందే.

పరామర్శ


భీమారావును పరామర్శిస్తున్న పిరియ విజయ తదితరులు

సోంపేట: మేజర్ పంచాయతీకి చెందిన 11వ వార్డు మెంబర్ చింతల భీమారావు ఇటీవల గాయపడ్డారు. దీంతో ఆయనను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌లు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, ఎంపీటీసీలు పొడుగు కామేష్, బొమ్మిడి ధర్మరాజు, పార్టీ నాయకులు మల్లా వెంకటరమణ, పొందర లోకనాథం, తోట ఢిల్లీ, కోల తిరుపతి, తేజ పట్నాయక్, ఇందుగు లక్ష్మీనారాయణ, కొనపల సురేష్, శ్రీను తదితరులు ఉన్నారు.

డ్రైన్ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కేటీరోడ్డు-పాత జాతీయ రహదారిని కలిపే మూడు రోడ్ల కూడలి వద్ద మేజర్ డ్రైన్ పనులకు మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బెల్లాల శ్రీనివాసరావు, సవర సోమేశ్వరరావు, నాయకులు చంద్రశేఖర్ త్యాడి, కమిషనర్ నడిపేన రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ సమావేశం నేడు

ఇచ్ఛాపురం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మున్సిపల్ అభివృద్ధి పనులు, వార్షిక బడ్జెట్ అంచనాలు తయారు చేసేందుకు చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని వార్డులకు చెందిన కౌన్సిల్ సభ్యులతో పాటు కో-ఆప్షన్ సభ్యులు హాజరవ్వాలని కోరారు.

పారదర్శకంగా సరుకుల సరఫరా

కంచిలి: రేషన్ డీలర్లు పారదర్శకంగా సరుకులు సరఫరా చేయాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్ల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవరి నెలకు సంబంధించి సరఫరా చేస్తున్న సరుకులు, ఇతర సమస్యలపై సమీక్షించారు. సమావేశంలో సీఎస్‌డీటీ పి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పిట్టలసరియాలో సీఎఫ్ చేతివాటంపై విచారణ చేస్తున్న వెలుగు అధికారులు(ఫైల్)



ఇదేం తీరు..!

- వివాదాస్పదంగా వెలుగు శాఖ
- ఎస్‌హెచ్‌జీ సంఘాల నిర్వహణలో తప్పిదాలు
- కొంతమంది సీఎఫ్‌ల చేతివాటం
- తీర్మానాలు లేకుండా జమ అవుతున్న రుణాలు


వెలుగు కార్యాలయం

టెక్కలి:

మండలంలో వెలుగు శాఖ పనితీరు వివాదాస్పదంగా మారుతోంది. ఎస్‌హెచ్‌జీ సంఘాల సభ్యులకు తెలియకుండానే వారి ఖాతాలకు రుణాల నగదు జమ చేస్తున్న ఘటనలతో పాటు సీఎఫ్‌ల పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల గూడేం పంచాయతీకి చెందిన వెలుగు సీఎఫ్ తన పరిధిలోని కొన్ని సంఘాల సభ్యులకు సంబంధించి బ్యాంకుకు కట్టాల్సిన నెలవారీ వాయిదా డబ్బులను తన సొంత అవసరాలకు వినియోగించుకొని, నకిలీ బ్యాంకు రశీదులను సభ్యులకు ఇవ్వడం, ఆ తర్వాత వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా టెక్కలి మండలం కొండభీంపురం గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం తీర్మానం లేకుండా, సభ్యులకు తెలియకుండానే ఏకంగా రూ.17.96 లక్షలు వారి ఖాతాల్లో బ్యాంకు అధికారులు జమ చేసేశారు. 3 నెలల వరకు ఈ విషయం సభ్యులకు తెలియకపోవడం గమనార్హం. అలాగే టెక్కలి మండలం భగవాన్‌పురం పంచాయతీలో ఓ స్వయం సహాయక సంఘానికి చెందిన సభ్యుల నుంచి ఎటువంటి తీర్మానం లేకుండా సుమారు రూ.20 లక్షలు వారి ఖాతాలకు జమ చేసేశారు. ఈ విషయం ఆలస్యంగా తెలియడంతో సభ్యులంతా ఆందోళనకు గురయ్యారు. ఇవన్నీ గత రెండు నెలల కాలంలో టెక్కలి వెలుగు శాఖ పరిధిలో చర్చనీయాంశంగా మారుతున్న తప్పిదాలు. తరచూ వివాదాస్పదమైన ఘటనలు జరుగుతుండడంతో టెక్కలి మండలం పరిధిలో ఎస్‌హెచ్‌జీ సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఎస్‌హెచ్‌జీ సంఘాల నిర్వహణ విషయంలో సీఎఫ్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రతీ సంఘానికి సంబంధించి నిర్వహణ విషయంలో బుక్ కీపింగ్ ప్రక్రియ చేపట్టాలి. అయితే ప్రస్తుతం జరుగుతున్న తప్పిదాలతో సీఎఫ్‌ల పనితీరుపై పలు సందేహాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా ప్రతీ సంఘానికి రుణాల మంజూరు విషయంలో సీఎఫ్‌లు భారీ స్థాయిలోనే ముడుపులు దండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ గత రెండు నెలల కాలంలో టెక్కలి మండలం వెలుగు శాఖ పనితీరు, సంఘాల నిర్వహణ వివాదాస్పదంగా మారుతోంది. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

1,813 సంఘాల నిర్వహణ

టెక్కలి మండలంలో మొత్తం 1813 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు 652 సంఘాలకు రూ.52.96 కోట్ల లింకేజీ రుణాలు అందజేశారు. ఆయా సంఘాల పర్యవేక్షణకు 39 మంది సీఎఫ్‌లు, నలుగురు సీసీలు ఉన్నారు. ఇదిలా ఉండగా స్త్రీనిధి కింద సుమారు 677 మందికి రూ.3.38 కోట్ల రుణాలు అందజేశారు. అయితే ప్రస్తుతం తీసుకున్న రుణాలకు సంబంధించి సభ్యులు వారి ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా ఒక ప్రణాళికబద్ధంగా ప్రతినెలా వాయిదాల చెల్లింపులు చేస్తున్నారు. కానీ సభ్యుల తీర్మానాలు, సమాచారం లేకుండా ఇటీవల రుణాలు జమ చేయడంపై ఆందోళన చెందుతున్నారు.

ఓవర్ ఫైనాన్స్ వలన తప్పిదాలు



ఓవర్ ఫైనాన్స్ వలన ఇటువంటి పొరపాట్లు జరుగుతున్నాయి. అయితే సంఘాల నిర్వహణలో క్షేత్రస్థాయిలో సీఎఫ్‌లు ప్రత్యేక దృష్టి సారించాలి. ఇకపై ఎటువంటి తప్పిదాలు జరగకుండా సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తాం. అంతేకాకుండా సంఘాల నిర్వాహణపై మరింత అవగాహన కల్పిస్తాం. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా తప్పిదాలను సరిచేస్తాం.

– కె.శ్రీరాములు, ఏపీ, వెలుగుశాఖ, టెక్కలి

అధ్వానం



సంక్రాంతి నాటికి రోడ్లను పూర్తిగా బాగు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాటలు నీటిమూటలయ్యాయి. అధ్వానంగా కనిపిస్తున్న ఈ రోడ్డు కొళిగాం గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలో ఉంది. ఆంధ్రా-ఒడిశా గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ రోడ్డు గోతులతో ప్రయాణికులకు పరీక్ష పెడుతోంది. దీంతో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

ఆవిష్కరణ



కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ హాజరై పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి లఖినాన వెంకటాచలం, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, గుంట కోదండరావు, బోనెల గోపాల్, పాలవలస ధర్మారావు, ఆర్.సురేష్‌బాబు, ఆగతముడి వాసుదేవరావు, పి.జగదీశ్వరరావు, తమ్మినాన జయరాం, సిద్దేశ్వరరావు, మధుసూదన్, నాగేశ్వర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– కాశీబుగ్గ

పారిశుద్ధ్య పనులు



సంతబొమ్మాళి మండలంలోని హనుమంతునాయుడుపేట, పోతునాయుడుపేట గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు గురువారం నిర్వహించారు. మురికి కాలువల్లో పూడికతీత చేపట్టి బ్లీచింగ్ చల్లారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి

అర్ధాంతరంగా ఆగిన లే అవుట్ల పంపిణీ


లాటరీ పద్ధతిలో పేర్లు చదువుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: వైఎస్సార్‌సీపీ హయాంలో పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో రైతుల నుంచి సుమారు 150 ఎకరాల భూమిని ఎంఐజీ ఇళ్ల స్థలాల కోసం అధికారులు సేకరించారు. ఈ మేరకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అయితే అంతలోనే ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో మరలా శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ అధికారులు స్థలాల కేటాయింపుపై దృష్టి సారించారు. మొదటి విడతగా 50 ఎకరాల్లో 250 ప్లాట్లు అభివృద్ధి చేశారు. గతంలో దరఖాస్తులు చేసుకొని డబ్బులు చెల్లించినవారికి ఆ స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో గురువారం లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులకు ఆయా స్థలాలను కేటాయించాలని నిర్ణయించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనికి సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ కూడా హాజరయ్యారు. అతని సమక్షంలోనే లబ్ధిదారుల పేర్లను లాటరీ పద్ధతిలో చదువుతుండగా ఒక్కసారిగా అక్కడ గందరగోళం నెలకొంది. ఈ విధానం సరికాదని లబ్ధిదారులు వ్యతిరేకించారు. అందరి సమక్షంలో చీటీల ద్వారా అయితే బాగుంటుందని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఉద్యోగస్తులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జోక్యం చేసుకొని దీంట్లో లోపాలు కనిపిస్తున్నాయని, ప్రక్రియను నిలుపుదల చేస్తున్నామని ప్రకటించారు. దీంతో అధికారులపై ఎమ్మెల్యే గౌతు శిరీష అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, ఆర్డీవో జి.వెంకటేష్, మున్సిపల్ ఈఈ సుగుణాకర్‌రావు, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, టీడీపీ నాయకులు పి.విఠల్, లొడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్సీ నర్తు రామారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని మిల్లర్ల బ్యాంకు గ్యారంటీ(బీజీ)లు అయిపోవడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. 60 నుంచి 70 కి.మీ దూరంలో ఉన్న నందిగాం, టెక్కలి, పలాస ప్రాంతాలకు వెళ్లి ధాన్యాన్ని మిల్లులకు ఇవ్వాలంటూ ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ధాన్యం ఇవ్వడానికి ట్రాక్టర్‌పై నందిగాం మిల్లుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన రైతులు దుంప నారాయణ, బి.భూపతిలు రోడ్డు ప్రమాదానికి గురయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించాలని సూచించారు.

పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు నూతన పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. కళాశాలకు చెందిన సీఎస్‌డీ అండ్ ఎంసీఏ, ఐటీ విభాగాలకు చెందిన అధ్యాపకులు టి.నరేష్, పి.రమేష్‌నాయుడుతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.కల్యాణ్, పి.ప్రియాంక తదితరులు నూతనంగా రచించిన యసెన్షియల్ ఆఫ్ పైథాన్ ప్రోగ్రామింగ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బీటెక్ కంప్యూటర్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

కాశీబుగ్గ: ఈనెల 30వ తేదీన పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పురపాలక సంఘం చైర్మన్ బి.గిరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ ప్రతిపాదనలు, 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదం కోసం కౌన్సిల్ ముందు ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

టెక్కలి: కోటబొమ్మాళి పీఏసీఎస్ పరిధిలో వ్యవసాయ రుణాలు తీసుకున్నవారు ఫిబ్రవరి 28వ తేదీలోగా 7 శాతం వడ్డీతో రెన్యువల్ చేసుకోవాలని కార్యాలయం సీఈవో ఎం.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. వడ్డీతో పాటు వన్‌బీ, బయోమెట్రిక్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటోతో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. గడువు దాటితే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

నందిగాం: మండలంలోని దిమిలాడ సొసైటీ పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులు రెన్యువల్ చుసుకోవాలని సొసైటీ సీఈవో శ్రీనుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులంతా గమనించాలన్నారు.

రోడ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వీడండి


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలపై ఇంజినీరింగ్ సహాయకులు నిర్లక్ష్యం వీడాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్‌లు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు వెనుకబడిన, నాణ్యత ప్రమాణాల్లో తేడాలున్న సచివాలయాల సహాయకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హరిబాబునాయుడు

సోంపేట: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు సూచించారు. మండలంలోని బారువ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమన్నారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచగవ్య తయారీపై అవగాహన

కంచిలి: మండలంలోని అంపురం యూనిట్ పరిధి చిన్నకొజ్జిరియా పంచాయతీ చంద్రుపుట్టుగ గ్రామంలో జీడి మామిడి రైతులకు పంచగవ్య తయారు చేసే విధానంపై సేంద్రియ విధానం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి గురువారం అవగాహన కల్పించారు. అనంతరం పంచగవ్య ఉపయోగాలను రైతులకు వివరించారు. దీనివలన జీడి మామిడిలో పూత బాగా ఉంటుందని, దిగుబడి కూడా బాగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఏ శివాజీ, ఎంటీలు సూర్యనారాయణ, దుర్గాప్రసాద్, ఎంఏ శివానందం తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మేలు

ఇచ్ఛాపురం: ప్రత్యేక అవసరాల చిన్నారులకు భవిత కేంద్రాల్లో అందించే ఫిజియోథెరపీతో మేలు జరుగుతుందని ఫిజియోథెరపిస్టు బి.అమూల్య అన్నారు. పురపాలక సంఘం పరిధి ముత్యాలమ్మపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ఎస్ఎస్ఏ అధ్వర్యంలో గురువారం ఫిజియోథెరపి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శివకుమార్, సహిత ఉపాధ్యాయులు ఎస్.సూర్యం, హెచ్.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయమందిస్తున్న యువశక్తి సంఘం సభ్యులు

కవిటి: మండలంలోని బి.గొనపపుట్టుగకు చెందిన బడగల చిన్నారావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో స్థానిక యువశక్తి సంఘం సభ్యులు గురువారం చేయూత అందించారు. తమవంతుగా వారి కుటుంబ సభ్యులకు రూ.11,000ల ఆర్థిక సాయం అందజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేతాజీ పోరాటం స్ఫూర్తిదాయకం

భారత స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపించిన తెగువ ప్రపంచ దేశాల్లో ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. బోస్ 128వ జయంతి వేడుకలు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో...


పలాస: బొడ్డపాడులో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


కవిటి: కొత్తపుట్టుగలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు


కంచిలి: బూరగాం పాఠశాలలో...


సోంపేట: జింకిభద్ర ఉన్నత పాఠశాలలో...


టెక్కలి: శాఖా గ్రంథాలయంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు


సంతబొమ్మాళి: బోరుభద్ర పాఠశాలలో...


ఇచ్ఛాపురం రూరల్: ఇన్నేశుపేట పాఠశాలలో...